బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు

బాన్సువాడ రూరల్, మార్చి 26 : తనను బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పార్టీ తనపై నమ్మకంతో ఇన్‌చార్జిగా నియమించడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడుతానని పేర్కొన్నారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

కామారెడ్డి, మార్చి 26 : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. మొత్తం 62 సెంటర్లలో మంగళవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 9:30 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించారు. 11,962 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 11,939 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు. ప్రైవేట్‌లో 10 మంది విద్యార్థులకు 9 మంది హాజరయ్యారన్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

కాపాడిన యువకులు

చెరువులో దూకిన విజయను బయటికి తెస్తున్న స్థానికులు

నందిపేట్, మార్చి 26: నందిపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రఘునాథ చెరువులో దూకి ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించగా గమనించిన ఇద్దరు యువకులు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా లింగాయపల్లికి చెందిన విజయ అనే వివాహిత కుటుంబ ఆర్థిక సమస్యలు, భర్త వేధింపులు తాళలేక నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లింది. మంగళవారం నిజామాబాద్ జిల్లా నందిపేట్ చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా.. అటుగా వెళ్తున్న మచ్చర్ల సాగర్, ఉమ్మడ్ట్రాక్టర్ ఊశన్న ఇద్దరు వెళ్లి ఆమెను కాపాడినట్లు స్థానికులు తెలిపారు. విజయ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామేశ్వరపల్లి శివారులో

యువకుడి దారుణ హత్య

కామారెడ్డి రూరల్ , మార్చి 26: కామారెడ్డి మండలంలోని రామేశ్వరపల్లి గ్రామ శివారులో ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన బోయ నవీన్‌కుమార్ (23) ఆటో నడుపుకొంటూ బతుకుతున్నాడు. మంగళవారం ఉదయం తన తల్లిని ఆటోలో వ్యవసాయ క్షేత్రం వద్ద వదిలి కామారెడ్డి వైపు బయల్దేరాడు. మార్గమధ్యంలో రామేశ్వరపల్లి గ్రామశివారులో ఆరెపల్లి గ్రామానికి చెందిన భువనగిరి మధు, పొందుర్తి ప్రవీణ్ అనే ఇద్దరు వ్యక్తులు ఆటోను అడ్డుకొన్నారు. ఆటోను ముత్తాగౌడ్‌కు చెందిన పొలంలోకి తీసుకెళ్లి నవీన్‌కుమార్‌పై కత్తితో దాడిచేశారు. దీంతో ఛాతి, మెడ, కడుపు, ఎడమచేతిపై తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి బోయ పెద్ద నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పాత కక్షలు పెట్టుకొని తన కొడుకును హత్యచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల విధుల ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సిబ్బంది మొదటి విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్ఐసీ హాల్‌లో మంగళవారం కలెక్టర్, రెవెన్యూ కలెక్టర్ చంద్రమోహన్ సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కోసం పీవో, ఏపీవోలను నియమించడం, వారితో శిక్షణ అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోకవర్గాల పరిధిలోని పోలింగ్ అధికారులకు మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2, 3, 4వ తేదీల్లో మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఉంటుందని చెప్పారు. కామారెడ్డి నియోజకవర్గ ఎన్నికల అధికారులకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎన్నికల అధికారులకు ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులకు ఏప్రిల్ 3, 4వ తేదీల్లో బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, బాన్సువాడ నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులకు 4వ తేదీన బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కోసం మైక్రో అబ్జర్వర్లను నియమించామని, రిజర్వు సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచామన్నారు. మొదటి విడుతగా మాస్టర్ ట్రైనర్స్‌తో ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎన్నికల అధికారులకు శిక్షణ పకడ్బందీగా ఇచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీపీవో రాజారాం, నోడల్ అధికారి వరదారెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

దోమకొండలో పోలీసుల కవాతు

దోమకొండలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దోమకొండ, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు మేమున్నామని భరోసా ఇచ్చేందుకు డీఎస్పీ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం దోమకొండలో పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఎన్నికల సమయంలో ప్రజలు ఎవరు కూడా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భిక్కనూర్ సీఐ సంపత్‌కుమార్, దోమకొండ ఎస్సై గణేశ్, బీబీపేట ఎస్సై ప్రభాకర్, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ముస్కాన్

రామారెడ్డి, మార్చి 26: ఎల్లారెడ్డికి చెందిన ముస్కాన్ అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఖుసుమాబేగం కుటుంబం ఎనిమిదేండ్ల క్రితం ఎల్లారెడ్డికి వలసవచ్చి నివాసం ఉంటున్నది. ఈనెల 20వ తేదీన ముస్కాన్‌ను తల్లి మందలించింది. దీంతో ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిం ది. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, ఆచూకీ తెలిసిన వారు 8712686160, 871526078 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట్, మార్చి 26 : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రజలకు సైబర్ మోసాలపై మంగళవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై గంగారెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ సైబర్ మోసాలు కూడా ఎక్కువవుతున్నాయని అన్నారు. వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై గంగారెడ్డి

ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్ట్

మాచారెడ్డి, మార్చి 26 : పాల్వంచ మండలంలోని ఇసాయిపేట గ్రామంలో పేకాడుతున్న ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వీరినుంచి రూ.2500లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. పేకాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, మార్చి 26 : తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లోని శిక్షణ కేంద్రంలో యూపీఎస్సీ సీశాట్ 2024-25 సంవత్సరానికి గాను ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 మంది డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైను, బుద్ధిస్ట్, పార్శీ) అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ 28న ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల కామారెడ్డిలో హైదరాబాద్ వారిచే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23236112 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దవాఖాన సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్ అందజేత

సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్‌ను అందజేస్తున్న సీపీఐ నాయకులు

బాన్సువాడ, మార్చి 26 : పట్టణంలోని వంద పడుకల మాతాశిశు దవాఖానలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, పేషేంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్ తదితర కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల వేతనాలను మార్చి నెలతో కలిపి చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ.. ప్రతిరోజూ దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ ఖమ్రోద్దీన్, రేణుక, సంతోష్‌గౌడ్, సురేఖ, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర స్థలాల పరిశీలన

దోమకొండ శివారులో ప్రమాదకర స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దోమకొండ, మార్చి 26 : మండలంలోని పలుచోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదకర మలుపులు, స్థలాల్లో వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో దోమకొండ ఎస్సై గణేశ్, జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు

చిల్లర్గిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో కమలాకర్

పిట్లం ఎంపీడీవో కమలాకర్

పిట్లం, మార్చి 26: మండలంలోని నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో కమలాకర్ అన్నారు. మండలంలోని చిల్లర్గి నర్సరీని ఆయన మంగళవారం సందర్శించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 26 గ్రామపంచాయతీల పరిధిలో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలు పెంచుతున్నామని చెప్పారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పది వేల మొక్కలను పెంచుతున్నామని, ప్రతి మొక్కనూ సంరక్షించేందుకు నర్సరీలో షేడ్ నెట్లను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. నర్సరీల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొక్కలకు నీరు పట్టించడం, పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం తదితర పనులు చేయిస్తున్నామన్నారు. ఎండలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో ప్రతిరోజూ రెండుపూటలా నీరు పట్టేలా చూస్తున్నామని తెలిపారు. హరితహారం కార్యక్రమం ప్రారంభమయ్యే వరకు మొక్కలను సిద్ధం చేస్తామని చెప్పారు.

నేడు ఉచిత పశు వైద్య శిబిరం

సదాశివనగర్, మార్చి 26: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి జుగల్ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడున్నర గంటల నుంచి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తప్పకుండా తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు.

గ్రాసం..గోస

యంత్రాలతో కోతలు.. చేతికి అందని గడ్డి
మినుము, సోయా పొట్టుకు డిమాండ్
ప్రభుత్వం సబ్సిడీపై దాణా సరఫరా చేయాలని డిమాండ్


జొన్న సొప్పను ఆరబెడుతున్న రైతులు

డోంగ్లీలో మినుము పొట్టును ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న కూలీలు
సోయా పొట్టు, సొప్పను నిల్వ చేసుకున్న రైతులు

డోంగ్లీ, మార్చి 10: ఆరుగాలం కష్టపడే రైతన్నకు పశు పోషణ కూడా కష్టంగా మారుతున్నది. వాటికి గ్రాసం సమకూర్చడం తలకు మించిన భారంగా మారుతున్నది. ప్రస్తుత కాలంలో యంత్రాల ద్వారా పంటలను కోస్తున్నారు. దీంతో ఏడాది కాలం పాటు పశుగ్రాసం నిల్వ ఉంచుకోలేకపోతున్నారు. గతంలో వరిని కోసి, కొట్టడం ద్వారా గడ్డి మిగిలేది. దానిని వాముగా పెట్టుకొని ఏడాదిపాటు పశువులకు వేసేవారు. వరి, మక్కజొన్న, జొన్న, సోయా, మినుము పంటల గడ్డి, సొప్ప, పొట్టును పశు గ్రాసంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం హార్వెస్టర్ల ద్వారా కోతలు చేపట్టడంతో గ్రాసానికి గోస పడాల్సి వస్తున్నది. డోంగ్లీ మండలంలో అత్యధికంగా మూడు వేల ఎకరాల్లో సోయా పంట సాగుచేస్తున్నా పొట్టు మాత్రం చేతికి అందడంలేదు. చిన్న యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తే పొట్టు వచ్చేదని, ప్రస్తుతం హార్వెస్టర్ల ద్వారా కోతలు చేపట్టడంతో పొట్టు రావడం లేదని రైతులు అంటున్నారు. చేతి కోతతో ఎకరాకు రూ.6500 ఖర్చు వస్తుందని, యంత్రాల ద్వారా కోతలు చేపడితే రూ.రెండువేల నుంచి రెండున్నర వేలు అవుతుందని, దీంతో అందరూ యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు.

పెరిగిన పశుగ్రాసం ధరలు..

పశుగ్రాసం ధరలు పెరగడంతో చాలా మంది రైతులు పాడి పశువులను పెంచడంపై ఆసక్తిని చూపడం లేదు. ట్రాక్టర్ సోయా పొట్టు రూ.మూడు వేల నుంచి నాలుగు వేల వరకు ధర పలుకుతున్నది. అది అదనపు భారంగా మారడంతో పాడి వైపు మొగ్గు చూపడం లేదు. ప్రభుత్వం సబ్సిడీపై దాణాను సరఫరా చేయాల నిరైతులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే షిండే వాహనం తనిఖీ

వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నిజాంసాగర్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వెల్గనూర్ గేటు వద్ద చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ప్రయాణిస్తున్న కారును చెక్‌పోస్టు వద్ద పోలీసులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షిండే వారికి పూర్తిగా సహకరించారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్ష
దరఖాస్తులకు గడువు పొడిగింపు

పెద్దకొడప్‌గల్, మార్చి 26: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.నళిని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలోని 6వ తరగతిలో బీసీ-1, మైనార్టీ-2, 7వ తరగతిలో బీసీ-1, 9వ తరగతిలో బీసీ-2, ఎస్టీ-1 సీటు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రామారెడ్డి, మార్చి 26: మండలంలోని గోకుల్‌తండా, మోషంపూర్, పోసానిపేట్ గ్రామాలను ఎంపీడీవో సవితారెడ్డి మంగళవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో కూలీలు చేపడుతున్న ఉపాధి హామీ పనులతోపాటు రైతులు నిర్మించుకున్న పాంపాండ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు మౌనిక, స్రవంతి, నరేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి

సామగ్రి అందజేత


అల్లాపూర్ హనుమాన్ ఆలయానికి సామగ్రిని అందజేస్తున్న గ్రామ యువకులు

పిట్లం, మార్చి 26: మండలంలోని అల్లాపూర్ హనుమాన్ ఆలయానికి గ్రామానికి చెందిన హనుమాన్ సైన్యం సంఘ సభ్యులు మంగళవారం రూ.21 వేలు విలువ చేసే జ్యోతి, హుండీ, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయం చేశామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పర్వయ్య, ఉపాధ్యక్షుడు సాయిసుధీర్, ప్రధాన కార్యదర్శి విఠల్, కోశాధికారి శంకర్, సభ్యులు సాయిరెడ్డి, సురేందర్‌రావు, బాలాజీరావు, సాయిరాం, సంతోష్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కాంత్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, మల్లుగొండ, బషేందర్, పండరీరావు తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు

అంబలి కేందం ప్రారంభం

నిజాంసాగర్, మార్చి 26: మహ్మద్‌నగర్‌లో ఏర్పాటుచేసిన అంబలికేంద్రాన్ని జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు మంగళవారం ప్రారంభించారు. తన తండ్రి దఫేదార్ కిషన్ జ్ఞాపకార్థం అంబలికేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండల కేంద్రంలో పదేండ్లుగా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, వాజిద్‌అలీ, మహేందర్, ఇఫ్తాకర్, చందర్, సురేశ్, దఫేదార్ విజయ్, నరేశ్, రామాగౌడ్, సాయిలు, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

నిజాంసాగర్, మార్చి 26: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపీవో యాదగిరి, గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలకు పరీక్షలు

పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీలేఖ

డోంగ్లీ, మార్చి 26: డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం కొనసాగుతున్నది. ఈ సందర్భంగా మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక వైద్యం అవసరం ఉన్నవారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు రిఫర్ చేస్తున్నామని వైద్యాధికారిణి శ్రీలేఖ తెలిపారు. డీఈవో ఉదయ్, సీహెచ్‌వో పండరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ప్రశాంత్(ఫైల్)

రామారెడ్డి, మార్చి 26: ఎల్లారెడ్డి మండలంలోని బాన్సువాడ - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలం హసన్‌పల్లి గ్రామానికి చెందిన కుర్మ ప్రశాంత్(21) బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ట్రక్కు ఢీకొన్నది. ట్రక్కు టైర్లు అతడి తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పెచ్చులూడిన తరగతి గది పైకప్పు
తప్పిన ప్రమాదం

తరగతి గది పైకప్పు ఊడిపోవడంతో కిందపడిన పెచ్చులు

పెద్దకొడప్‌గల్, మార్చి 26: మండలంలోని కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి గది పైకప్పు మంగళవారం పెచ్చులూడింది. విద్యార్థులు ప్రార్థనకు వెళ్లి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గమనించిన ఉపాధ్యాయులు.. విద్యార్థులను అటువైపునకు వెళ్లకుండా చూశారు. దీంతో ప్రమాదం తప్పింది. తరగతిలో సుమారు 25మంది విద్యార్థులు ఉంటారని, పెను ప్రమాదం జరిగేదని తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను వారు అభినందించారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.